

ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, డిఆర్‌ఓ మోహన్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ,సాధికారత అధికారి జి.చిన్నయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో గత సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలు వాటికి సంబంధించి తీసుకున్న చర్యలతో పాటుగా ఈ సమావేశంలో డివిఎంసి సభ్యులు, ఇతరులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలపై జిల్లా కలెక్టర్ చర్చించారు. డివిఎంసి సభ్యులు మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల వసతి గృహంలో113 మంది బాలికలు ఉన్నారని, నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అదనంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పూనూరు మండలం పరిధిలో ఎస్టీ కాలనీ వద్ద వయోవృద్ధుల కోసం అనాథశ్రమ నిర్వహించడం జరుగుతుందని దానికోసం ఐదు ఎకరాలు భూమిని మంజూరు చేయాలని, ఎస్టీలకు సంబంధించి ఎరుకుల, సుగాలి, యానాది, నక్కల వాళ్ళ సాంప్రదాయ కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. సోమల, సదుం మండలాల్లో యానాదుల అనుభవంలో ఉన్న భూములు అగ్రకులాలు వారు ఆక్రమించుకున్నారని, వీరిపై దౌర్జన్యాలు చేస్తున్నారని దీనిపైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కి విన్నవించారు. వీటిపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహంలో అవసరమైన మరుగుదొడ్లు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, దీనికి సంబంధించి పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వ భూమి కల్పించుట వీళ్లు పడదని, ఎస్టీ కళాకారులకు అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. చౌడేపల్లి యానాదుల భూములకు సంబంధించి డిఆర్‌ఓ వెళ్లి పరిశీలిస్తారని, ఈ సమస్యను కూడా త్వరలో పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. పూతలపట్టు, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల్లో రూ.30కోట్లతో ఎస్సీ, ఎస్టీ గ్రామాలలో రోడ్డు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, మిగిలి నియోజకవర్గంలో కూడా అన్ని ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, సిసి రోడ్లు, తాగునీటి సమస్య లేకుండా పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలో భూ సమస్యలు చాలా వరకు ఉన్నాయని వాటిని కూడా త్వరలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 2025 జనవరి 1 నుంచి ఇప్పటివరకు 21 ఎస్సీ,ఎస్టీ కేసులు నమోదు అయ్యాయని వాటికి సంబంధించి సుమారు రూ.1,72,5000లు చెల్లించడం జరిగిందన్నారు. ఈసమావేశంలో ఆర్‌డిఓలు, డీఎస్పీలు, వివిధ శాఖల అధికారులు, డాక్టర్ బాణామతి, మునిచంద్ర నాయక్, రాజకుమార్, శేషాద్రి, వరలక్ష్మి, శంకరయ్య, ఎన్జీవో ధనశేఖర్ డివిఎంసి సభ్యులు పాల్గొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం

రూ.25 కోట్లతో మామిడి పంట విస్తరణ

- రాష్ట్రంలో 1.12 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు
- రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల డైరెక్టర్
- ఆర్‌కెవివై, ఎంఐడిహెచ్ కింద జిల్లాకు రూ.20 కోట్లు సాయం: కలెక్టర్





ఉద్యాన పంటల సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల డైరెక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): చిత్తూరు జిల్లాలో మామిడి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని, ఉత్పాదకత పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల డైరెక్టర్ కె. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిత్తూరు పట్టణంలోని ఎన్‌పిసి పెవిలియన్‌లో మామిడి రైతులు, కొనుగోలుదారులతో ఉద్యాన పంటల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల డైరెక్టర్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు నగర మేయర్ అముద, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అతిథులు ప్రారంభం చేసి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన మేర మామిడి పంట విస్తీర్ణం జరిగిందని, ఉత్పాదకత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఒక హెక్టారుకు 12 మెట్రిక్ టన్నులు ఉండగా, దేశంలోని గుజరాత్ లాంటి రాష్ట్రాలలో ఒక హెక్టారుకు 15 వేల మెట్రిక్ టన్నులు ఉత్పాదకత ఉన్నదని, ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మన దేశంలో ఒక హెక్టారుకు సుమారు 9 మెట్రిక్ టన్నులు ఉండగా బ్రెజిల్ లాంటి దేశాలలో 20 నుండి 25 మెట్రిక్ టన్నులు ఉత్పాదకత ఉందన్నారు. మామిడి పంటతో పాటు ఇతర ఉద్యాన పంటల ఉత్పాదకత, మార్కెటింగ్, ప్రాసెసింగ్, గిట్టుబాటు ధరలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్న నేపథ్యంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, గత 6 నుండి 7 నెలల కాలంలో లక్ష హెక్టార్లకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అమలు చేశామని, దేశస్థాయిలో గత సంవత్సర కాలంలో 1.12 లక్షల హెక్టార్లకు మైక్రో ఇరిగేషన్ అమలు చేసి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. ఉత్పాదకత లేని మామిడి తోటలను తిరిగి పునరుజ్జీవం చేసేలా పంట తెగులు నివారణపై శాస్త్రజ్ఞులతో పరిశోధనలు చేయిస్తున్నామని, బయో లిక్విడ్ వాడకం ద్వారా భూసారం పెంచగలిగితే ఉత్పాదకత పెరిగే పరిస్థితి ఉందన్నారు. తద్వారా గతంలో రూ.5వేల వరకు ఆదాయం పొందే రైతు రూ.30వేల వరకు ఆదాయం చూడొచ్చన్నారు. మామిడి పంట ఉత్పాదకతతో పాటు మార్కెటింగ్, ప్రాసెసింగ్, ప్రకృతి విపత్తు సమయంలో రైతులను ఆదుకోవడం పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మొదటిసారిగా మామిడి పంటకు ఇన్స్యూరెన్స్ చేయడం జరుగుతున్నదని, 20 వేల మంది రైతుల ద్వారా ఇన్సూరెన్స్ కార్యక్రమం చేశామన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉత్పత్తిపరంగా, నాణ్యతా పరంగా చిత్తూరు జిల్లా మామిడికి చాలా ప్రాధాన్యత ఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో దాదాపు 75వేల మంది రైతులు మామిడి పంటపై ప్రధానంగా ఆధారపడి ఉన్నారని, దాదాపు 90వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు ఉండగా అందులో 70 వేల హెక్టార్ల వరకు మామిడి పంట ఉందని తెలిపారు. గత 10 సంవత్సరాల కాలంలో చెరకు, వేరుశనగ రైతులు మామిడిపై అధిక దృష్టి సారించడంతో మామిడి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని, ఎంజిఎన్ ఆర్‌ఈజిఎస్ కింద పంట విస్తీర్ణం పెంచడానికి సహకారం అందించామన్నారు. మామిడి సాగు ఉత్పాదక, మార్కెటింగ్, గిట్టుబాటు ధర, ప్రాసెసింగ్ అంశాలలో మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. మామిడి సీజన్‌కు ముందు, సీజన్ సమయంలో తీసుకోవలసిన మెళకువలు, ప్రభుత్వ రుణాలు, సబ్సిడీ వివరాలు వివరించడం జరుగుతుందన్నారు. గత 9నెలల కాలంలో చిత్తూరు జిల్లాకు 10వేల మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేసిందని, ఆర్‌కెవివై, ఎంఐడిహెచ్ కింద రాష్ట్రంలో అత్యధికంగా జిల్లాకు రూ.20 కోట్లు సహాయం అందించడం జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.25కోట్లతో మామిడి పంట విస్తరణ, క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. చిత్తూరు మామిడి ఉత్పత్తి పరంగా, నాణ్యతా పరంగా మెరుగ్గా ఉన్నందున ఇతర రాష్ట్రాల నుండి దేశాల నుండి కొనుగోలుదారులు చిత్తూరు మామిడిపై పెట్టుబడికి ముందుకు వస్తున్నారని, ఇది శుభపరిణామం అన్నారు. చిత్తూరు ఉద్యాన పంటల పెంపకం సదస్సు ద్వారా మామిడి రైతులకు, కొనుగోలుదారులకు మరింత అవగాహన పెంచగలమని ఆశిస్తున్నామన్నారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు అధికంగా మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారని, మామిడి పంట, ఇతర పంటలను విక్రయించడానికి తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. మామిడి రైతులకు ప్రభుత్వం ఉంటూ గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పూతలపట్టు ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎంజిఎన్‌ఆర్ ఈజిఎస్ పథకం ద్వారా ఉచితంగా మామిడి మొక్కల పంపిణీ, నీటి సౌకర్యం కల్పించడం ద్వారా మామిడి పంట సాగు విస్తీర్ణం జిల్లాలో పెరిగిందన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు క్యూలైన్‌లో, నడకదారిలో ఉచితంగా అందిస్తున్న ఆహారం, పాలు, మజ్జిగతో పాటు మామిడి జ్యూస్‌ను కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని అసెంబ్లీ వేదికగా కోరడం జరిగిందని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఉద్యానశాఖ అదనపు సంచాలకులు హరినాథ్‌రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ మైక్రో ఇరిగేషన్ వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవముని రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా ఉద్యాన, వ్యవసాయ, ఏపిఎంఐపి, పట్టుపరిశ్రమ శాఖల అధికారులు మధుసూదన్ రెడ్డి, మురళీకృష్ణ, బాలసుబ్రమణ్యం, శోభారాణి పాల్గొన్నారు.



కల్లుడి ఎఫ్‌పిఓ కనెక్ట్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న కలెక్టర్

నేడే ఇంటర్ ఫలితాలు

విద్యార్థుల్లోనూ, తల్లిదండ్రుల్లోనూ టెన్షన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇంటర్ పరీక్షా ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ షెడ్యూల్‌ను వెల్లడించారు. మార్చి 1-20 వరకూ ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 32,432 మంది, ద్వితీయ సంవత్సరంలో 31,726 మంది పరీక్షలు రాసినట్లు ఆర్‌ఐఒ ప్రభాకర్‌రెడ్డి 'ప్రజాశక్తి'కి తెలిపారు. వరుసగా సెలవులు వస్తున్న నేపథ్యంలో 15పైన ఇంటర్ ఫలితాలు వెలువడతాయని చర్చనడిచింది. అయితే విద్యార్థులు ఎంసెట్ కోచింగ్‌కు వెళ్లాలన్నా, ఇతరత్రా పరీక్షలకు హాజరవ్వాలన్నా ప్రభుత్వం అనుకున్న ప్రకారమే ఇంటర్ ఫలితాలను 12వ తేదీ శనివారం విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులపై కార్పొరేట్ కాలేజీల వారు ఒత్తిడి తెస్తున్నారు.



పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు


గాంధీ విగ్రహం ఎదుట ఏపీడబ్ల్యుజేఫ్ నిరసన



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి, మరో ఆరు మందిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏపీజేడబ్ల్యుఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు జయరాజ్, జిల్లా అధ్యక్షులు ప్రకాష్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కేశవులు, బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను పోలీసులే అడ్డుకుంటే ప్రజాస్వామ్యం మనుగడలో ఉందా అని ప్రశ్నించారు. అక్రమ కేసులు ఎత్తివేయకుంటే యూనియన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం వన్ టౌన్ సిఐ మహేశ్వరకు వినతిపత్రం సమర్పించారు. నిరసన కార్యక్రమంలో పత్రిక, మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

భూ వివాదంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- విజయపురం: శవ పంచాయతీలో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నంకి పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గంగమాంబాపురంలో గత నాలుగేళ్లుగా గాలి జగదీష్, గాలి బాలయ్య నాయుడు కుటుంబాల మధ్య భూ సమస్య ఉంది. ఇరువర్గాల వారు మా భూమి అంటే మాభూమి అంటూ ఘర్షణ పడి పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం బాలయ్యనాయుడు తల్లి సుందరమ్మ మరణించింది. ఆమె మృతదేహాన్ని వివాదం జరుగుతున్న పొలంలోనే దహన సంస్కారాలు చేయాలని గుంత తవ్వారు. సమాచారం తెలుసుకున్న జగదీష్, అతని వర్గం వారు విజయపురం తహశీల్దార్‌ను కలిసి సమస్య వివరించడంతో ఆయన 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. దీంతో ఎస్ఐ రంగా సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని భూ వివాదం పరిష్కారం అయ్యేవరకు ఆ పొలంలో దహన సంస్కారాలు చేయకూడదని అడ్డుకున్నారు. అనంతరం బాలయ్య వర్గం తహసీల్దార్ను సంప్రదించి రికార్డులు చూపడంతో ఆయన వారికి అనుకూలంగా వ్యవహరించారని, దహన సంస్కారం చేసుకోవచ్చని మౌఖిక ఆదేశాలు ఇచ్చారని సమాచారం తెలుసుకున్న గాలి జగదీష్ మనస్థాపానికి గురై పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడరు. కుటుంబ సభ్యులు గమనించి ఆయన నగరి ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం వలనే ఇలా జరిగిందని జగదీష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. భూవివాదం నేపథ్యంలో గ్రామంలో పరిస్థితి విషమించడంతో వేరే ప్రదేశంలో దహన సంస్కారం నిర్వహించారు. విజయపురం ఎమ్మార్వో కిరణ్ వివరణ మేరకు భూ తగాదాలు ఉన్న స్థలంలో శవాన్ని పూడ్చకూడదని 144 సెక్షన్ అమల్లోకి తెచ్చానని, ఇరువర్గాల మధ్య గొడవలు చూస్తే ప్రాపర్‌గా ఎవరికి రికార్డు లేదని దానికోసం ప్లాంట్ ఆర్డర్ ఇష్యూ చేశారని తహశీల్దార్ తెలిపారు. అదేవిధంగా భూ తగాదాలు ఉన్న చోట శవాన్ని పూడ్చకుండా వారి సొంత భూముల్లో దహన సంస్కారాలు చేసుకోవాలని చెప్పినట్లు పేర్కొన్నారు.



ఇరువర్గాలను నచ్చ చెబుతున్న పోలీలు, రెవెన్యూ అధికారులు

కేంద్ర మంత్రివర్గ ఆమోదం హర్షణీయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తిరుపతి- కాట్పాడి రైల్వేలైన్ డబ్బింగ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షనీయమని మాజీ ఎమ్మెల్యే ఏఎస్.మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు కారణమైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కృషి ఎనలేనిదని కొనియాడారు. రాయలసీమ ప్రగతికి తోడ్పాటునందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుపతి -కాట్పాడి వయా చిత్తూరు రైల్వే డబుల్‌లైన్ ఏర్పాటుకు కేంద్రం రూ.1332కోట్లు మంజూరు చేయడంతో పాటు 104 కి.మీల డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేయడం శుభపరిణామని అన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు రెండవ డిపో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ 2వ డిపో మేనేజర్ రూపశ్రీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



చిత్తూరులోని నగరపాలక కార్యాలయంలో ..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మహాత్మా జ్యోతిబా పూలే ఎనలేని కృషి చేశారని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతిబాపూలే 199వ జయంతిని పురస్కరించుకుని చిత్తూరు పట్టణం గాంధీ విగ్రహ కూడలిలో ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈడీ బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, ఇన్చార్జ్ బీసీ సంక్షేమ శాఖ అధికారి మునీంద్రయ్య, ఎంహెచ్ఓ లోకేష్, షణ్ముగం పాల్గొన్నారు. అలాగే చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మేయర్ అముద పూలమాల వేసి నివాళులర్పించారు. సమ సమాజ స్థాపనకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే నిరంతరం కృషి చేశారని, ఆయన సేవలను నేటితరం స్మరించుకోవాలని మేయర్ అన్నారు. సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ పి.లోకేష్, ఎంఈ వెంకట రామిరెడ్డి, సీఎంఎం వెంకట రమణ, ఆర్వో ఉమామహేశ్వర్ రెడ్డి, టీపీవో సుభప్రధ పాల్గొన్నారు.



చిత్తూరులో సిపిఎం నాయకులు

సిపిఎం ఆధ్వర్యంలో.. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో పూలే విగ్రహానికి సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశంలో ఉన్న శక్తులు కులాల వారీగా మతాలవారీగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న సందర్భంలో పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని యువతకు పిలుపునిచ్చారు. నాయకులు బాలసుబ్రమణ్యం, రాజేష్, దాము పాల్గొన్నారు.



గుడిపల్లి ద్రావిడ విశ్వవిదాలయంలో

గంగాధర నెల్లూరు: జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు. మండలంలోని నెల్లెపల్లి గ్రామ సచివాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. పంచాయతీ సెక్రెటరీ నాగేంద్ర నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ హేమావతి, డిజిటల్ అసిస్టెంట్ చిన్నబ్బ, ఏఎన్ఎం సుమతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఉప సర్పంచ్ వెంకటపతి రెడ్డి పాల్గొన్నారు.

గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎం.దొరసామి పూలే దేశానికి చేసిన సేవను కొనియాడారు. ద్రావిడ విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య వి.కిరణ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర జి.శైలమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలో టవర్ క్లాక్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగాయి. బిసిఎఫ్ నాయకులు గోవిందస్వామి, త్యాగరాజులు, శ్రీనివాసులు, వెంకటరమణ, బాలసుబ్రమణ, జూనియర్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో.. జ్యోతిరావు పూలే 199 జయంతి సందర్భంగా అన్నూరు ఈశ్వర్, సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, నాయకులు రాజా, జయంతి, ధనమ్మ, నందిని, లక్ష్మయ్య రత్నమ్మ, ప్రతాప్ స్థానిక సిపిఎం కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్వీ బాలాజీ, కిషోర్ గౌడ్, కుట్టి, గిరిబాబు, నాగరాజు, సుబ్రహ్మణ్యం శెట్టి పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కళామందిర్‌లో శుక్రవారం జ్యోతిరావు పూలే 198వ జయంతిని వ్యవస్థాపకులు తులసీ నారాయణ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.



పలమనేరులో సిఐటియు ఆధ్వర్యంలో



జీడీ నెల్లూరులో..

పుంగనూరు: స్థానిక ఇందిరా సర్కిల్‌లో బిసి సంఘం గౌరవ అధ్యక్షులు టి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా నియోజకవర్గం బిసి సంక్షేమ సంఘం కమిటీ అధ్యక్షులు చింతమాను ధనుంజయకు నియామకపత్రం అందజేశారు. సదుం మండలంలో చింతమాను కృష్ణయ్య, బిసిలకు చేసిన కృషిని స్మరించుకున్నారు. విశ్రాంతి డిఎస్‌పి సుకుమార్ బాబు, అద్దాలు నాగరాజు, బి.నరసింహులు, బిఆర్ఎస్ఎస్ అధ్యక్షురాలు ప్రతిభ, చిట్టెమ్మ, జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జద్ బాషా, పాల్గొన్నారు.

విజయపురం (నగరి): నగరి ప్రభుత్వ కళాశాలలో ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థులు అందరూ పట్టుదలతో చదివి జ్యోతిబాపూలే,అంబేద్కర్ స్ఫూర్తితో ఎదగాలని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భాస్కర్ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గోపి, సీనియర్ లెక్చరర్ బి.సుబ్రహ్మణ్యం, లెక్చరర్లు డాక్టర్ అరుణ్ కుమారి, చిన్న పాపమ్మ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మహనీయుడు మహాత్మ జ్యోతిరావు బాపులే అడుగుజాడల్లో ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, పలమనేరు నియోజకవర్గం యువత అధ్యక్షులు రమేష్, మదనపల్లి టౌన్ యువత అధ్యక్షులు ముఖండ్ల జగదీష్, పలమనేరు సమన్వయకర్త చిన్న మల్లప్ప, బీసీ ఫ్రంట్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, బాలసుబ్రమణ్యం, శివయ్య, పెద్దపంజాణి మండల అధ్యక్షులు మణి, ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షులు చలపతి పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుప్పం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, పట్టణ పరిధిలోని సామగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దీనదయాల్, పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద సాంఘిక కార్యకర్తలు జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



కుప్పం టిడిపి కార్యాలయంలో



నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఇంట్లో వుంటే దొంగల భయం..!

- బ్యాంకు ఖాతాలో భద్రత కరువు
- సైబర్ నేరగాళ్ల లూటీ
- ఖాతాదారుల డబ్బులు మాయం


ప్రజాశక్తి -వెదురుకుప్పం: రైతులు, స్థానికులు తాము కూడ బెట్టుకున్న డబ్బును ఇంట్లో దాచుకోవాలనుకుంటే సరైన భద్రత లేక దొంగల భయంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. అదే బ్యాంకులో అయితే తమ ఖాతాలో డబ్బులు భద్రంగా ఉంటాయని ప్రజల విశ్వాసం.. ఎక్కువ శాతం ప్రజలు, రైతులు తాము కష్టపడిన సొమ్మును బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసి అందులో కొంచెం కొంచెం దాచుకుంటూ తమకు ఏదైనా కష్టం వచ్చినప్పుడు తీసు కుంటారు. ఇలా అవసరమైందని ఓ రైతు బ్యాంకుకు వెళ్లి నగదు డ్రా చేద్దామని విత్ డ్రా ఫామ్ పై సంతకం పెట్టి క్యాషియర్ దగ్గర ఇస్తే 'నీ అకౌంట్లో డబ్బు డ్రా అయిపోయింది' అని చెప్పడంతో ఒక్క సారిగా ఆ రైతు అవాక్కయ్యాడు. 'లబోదిబో' అంటూ బ్యాంకు మేనేజర్‌ని ఆశ్రయించాడు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలం టి కేవం పురానికి చెందిన దొరస్వామిరెడ్డి అనే రైతు ఉన్నాడు. పచ్చికాపల్లం ఇండియన్ బ్యాంకులో అతనికి ఖాతా నెంబరు వుంది. మార్చి 6వ తేదీ



బ్యాంకులోకి వెళ్లి నగదు విత్ డ్రా ఫామ్ రాసి ఇచ్చాడు. ఆ క్యాషియర్ 'నీ అకౌంట్లో మార్చి 6వ తేదీ 90,300 రూపాయల నగదు డ్రా అయ్యిందని చెప్పాడు. ఏప్రిల్ మూడో తేదీ ఆ రైతు బ్యాంకుకి వెళ్లాడు. ఒక్కసారిగా నిశ్చేష్టుడయ్యి మేనేజర్‌ని ఆశ్రయించాడు. ఖాతాలో నగదు సైబర్ నేరగాళ్ల తస్కరణకు గురైనట్లు గుర్తించాడు. పై అధికారులకు వివరాలతో మెసేజ్ చేసినట్లు ఆ రైతు మీడియాకు తెలిపారు. 'బ్యాంకు లోనే ఇలా ఉంటే, తెలియని సామాన్యుల పరిస్థితి ఏంటి?' అని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకోవాలని, ఆ బ్యాంకులో ఇలాంటి వారు ఇంకా ఉన్నట్టు చెబుతున్నారని, బ్యాంకు అధికారులు ఖాతాదారులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చి అప్రమత్తం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంట్లో దాచుకుంటే దొంగల భయం



'ఇంట్లో దాచుకుంటే దొంగల భయం.. బ్యాంకులో ఇలా.. ఏమి చేయాలి..? వచ్చిన పంట, దాచుకున్న డబ్బులు ఇంట్లో భద్ర పరచు కోవాలంటే దొంగల భయం.. బ్యాంకులో దాచుకుంటే, నా ప్రమేయం లేకుండా నగదు డ్రా అయ్యింది. బ్యాంకు మేనేజర్‌ను అడిగితే రికవరీ అవుతుంది.. అంటున్నారు. ఏమి చేయాలో అర్థం కాలేదు. ఖాతాదారుల డబ్బులు సైబర్ నేరగాళ్లు మాయం చేస్తున్నట్లు సమాచారం. ఇలా మాయమైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయవచ్చు..అని తెలిసిన స్థానికులు చెబుతున్నారు.

- దొరస్వామి రెడ్డి, రైతు టికేవం పురం. వెదురుకుప్పం మండలం.

క్రైం న్యూస్



మాట్లాడుతున్న టిడిపి నాయకుడు సెల్వరాజు

టిడిపి నేతపై వైసిపి కార్యకర్తల దాడి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మండలం కొలమాసన పల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు సెల్వరాజు పై అదే గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు కుమార్, లోకనాథంలు బండరాయితో మోది తీవ్రంగా గాయపరిచినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుని కథనం మేరకు ..డ్వాక్రా బిల్ విషయంలో సభ్యులతో మాట్లాడు తుండగా పూర్వపు ప్రకారం లోకనాథం, కుమార్ లు వెనక నుండి బండరాయితో తలపై బలంగా మోది హత్య చేయడానికి ప్రయత్నించారని పేర్కొన్నాడు. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చే లోపు ఇద్దరూ పారిపోయారని తెలిపాడు. స్థానికుల సాయంతో హుటాహుటిన పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చేరినట్లు బాధితుడు సెల్వరాజు తెలిపారు. ఈ విషయంపై పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపిడివో పురుషోత్తం

ప్రత్యేక పారిశుధ్య పనులు: ఎంపిడివో

ప్రజాశక్తి -వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీలలో 15 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. మంగళవారం నల్లవెంగనపల్లి, అగ్గిచేనుపల్లి గ్రామ పంచాయతీల్లో రోడ్డు పక్కన చెత్తకుప్పలను, పేడ దిబ్బలను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వెదురుకుప్పం మండల అభివృద్ధి అధికారి పురుషోత్తం సందర్శించి పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరు, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో, రోడ్డు పక్క పేరుకు పోయిన చెత్త దిబ్బలు, పేడ దిబ్బలను తొలగించి ప్రతి గ్రామ పంచాయతీని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో 15 రోజుల పాటూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీ నరసింహ, లావణ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పార్థసారధి, స్థానికులు శివాజీ, బుజ్జిబాబు, గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సిపిడిసి కార్యదర్శి శ్రీపురం సీతారామయ్యను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఘనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు శ్రీవర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల సిపిడిసి కార్యదర్శి శ్రీపురం సీతారామయ్య ఉత్తీర్ణులైన 45 మంది విద్యార్థిని విద్యార్థులకు తన సొంత నిధులతో శ్రీపురం సీతారామయ్య నాగమణి వీవరిటబుల్ ట్రస్ట్ తరపున నగదు అవార్డులు, బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానంచేశారు. కళాశాల సిబ్బంది శ్రీపురం సీతారామయ్య ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 500 మంది కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు



మీడియాతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవద్దు..

అధికారులకు ప్రజల వినతి

ప్రజాశక్తి-శాంతిపురం: మండల పరిధిలోని కూతేగానిపల్లి లో సుమారు 70 సంవత్సరాలు క్రితం నిర్మించి శిథిలావస్థలో ఉన్న దేవాలయాన్ని పునర్నిర్మించు కోవడానికి అధికారులు సహకరించాలని గ్రామస్తులు కోరారు. కూతేగానిపల్లి గ్రామంలో శ్రీరామ దేవాలయాన్ని 70 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆ దేవాలయం చాలావరకు శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు కలిసి ఆ ప్రదేశంలో నూతన ఆలయాన్ని నిర్మిం చాలని నిర్ణయించారు. ఆర్థిక కారణాలవల్ల గత కొన్ని సంవత్సరాలుగా ఆలయ నిర్మాణ పనులు ఆగిపోయాయి. మళ్లీ గ్రామస్తులు చేరి చందాలు వేసుకుని ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణంలో గ్రామస్తులు పలువురు నాయకులు పాల్గొన్నారని, 70 శాతం వరకు ముగిసిన నిర్మాణ పనులను ఒక కుటుంబం వారు దేవాలయ స్థలం తమకు చెందిందని కోర్టులో దావా వేసి పనులు ఆపడం సబబు కాదని, వారు తెలిపిన ప్రదేశం కూతేగానిపల్లి గ్రామం చెందిన వారిదని కోర్టులో దావా వేసిన వారిది కాదన్నారు. కూతేగానిపల్లి 60-4 గ్రామకంఠంకు చెందిందని తెలిపారు. ఈ విషయంపై అధికారులు స్పందించి ఆలయ పునర్నిర్మాణం కోసం సహకరించాలని గ్రామస్తులు కోరారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి):

మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యమ ని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం అయితేపల్లిలో ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చిన అనంతరం కుట్టు మిషన్లను ఉచితంగా అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసి శేఖర్, సురేష్ రెడ్డి, బాలకృష్ణ, సక్కూరి ధనుంజయ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, మండల స్థాయి అధికారులు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని పరామర్శించిన రాకేష్ కిరణ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి క్రియాశీలక కార్యదర్శి, వైసీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ జిల్లా జడ్జి దొరస్వామి కుమారుడైన రాకేష్ కిరణ్ శుక్రవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఇటీవల పెద్దిరెడ్డి చేతికి గాయం కావడంతో ఆయనను పరామర్శించారు. రాకేష్ కిరణ్ వెంట బాల శేఖర్, అశోక్, ప్రసాద్, గోవింద స్వామి తదితరులున్నారు.



జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ప్రకాష్‌నాయుడు

కష్టం తెలిసిన వ్యక్తి ప్రకాష్ నాయుడు

ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: 'కష్టం తెలిసిన వ్యక్తి కోక ప్రకాష్ నాయుడు' అని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ పేర్కొన్నారు. మండలంలోని ఎర్రండ్లపల్లి గ్రామం లో సర్పంచ్ కోక ప్రకాష్ నాయుడు పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్య కార్యకర్త నుంచి ఎదిగి గ్రామ సర్పంచిగా, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గా ఎన్నికయ్యారని, సామాన్యుడి కష్టం తన కష్టంగా భావించి సాయం అందించడంలో ముందుం టాడని ఆయన సేవలు మరవలేనివని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, నాయకులు ధరణి, విక్రం రమణ, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మెప్మా ఆర్‌పిలు

శ్రమకు తగిన గుర్తింపునివ్వాలి

ఎమ్మెల్యేకు మెప్మా ఆర్‌పిల వినతి

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల శ్రమను గుర్తించి ప్రభుత్వం సరైన ప్రోత్సాహం ఇవ్వాలని ఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్పీల కాల పరిమితి రద్దు చేయాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న 8 వేల గౌరవ వేతనాన్ని, 18 వేలకు పెంచి ఇవ్వాలన్నారు. ప్రధానంగా మహిళా వికాస్ యాప్ వల్ల సంఘ సభ్యులతో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఆ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. సీనియర్ ఆప్‌పీలకు సిఓలుగా, సిఎల్‌ఆర్పిలుగా ఉద్యోగోన్నతి ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆర్పీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు ధనలక్ష్మి, జ్యోత్స్న, షకీలా బేగం, కస్తూరి, లావణ్య, గాయత్రి, జమున, శ్యామల, జరీనా పాల్గొన్నారు.



ద్రౌపది కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వేడుకగా ద్రౌపది కళ్యాణం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం మహాభారత ఉత్సవాల సందర్భంగా ద్రౌపది ధర్మరాజుల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవాల నిర్వహణ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళిమోహన్

వీరాంజనేయ విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానంలో వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన వీరాంజనేయ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళిమోహన్‌కు ఆలయ ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ అనుబంధ దేవాలయం వీరాంజనేయ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటూ ఈవో పెంచల కిషోర్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, బింబస్థాపన వంటి కార్యక్రమాలు ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఛైర్మన్‌లు మణి నాయుడు, మోహన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల మండల నిధులు వృథా

- పనుల కల్పనకు రెండు శాతం ముడుపులు చెల్లించాల్సిందే..
- మండలాధ్యక్షుడికి సమాచారం ఇవ్వకనే పనులు - సర్పంచ్‌ల ఆరోపణ

ప్రజాశక్తి -గంగవరం: 2024- 25 ఆర్థిక సంవత్సరానికి 50 లక్షల రూపాయల మండల నిధులు వృథా అయిపోయాయని, మండలంలో ఏవైనా పనులు కల్పించుకోవాలనుకుంటే రెండు శాతం ముడుపులు అప్పగించుకోవాల్సిందేనని, కనీసం మండల అధ్యక్షుడికి కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకనే పనులు కేటాయిస్తున్నారని సర్పంచులు గిరిజా రెడ్డి, భాస్కర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లా డుతూ తమ పంచాయతీలలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా ఎంపీడీవోకి రెండు శాతం తప్పనిసరిగా ముడుపులు అప్పగిస్తే గాని పనులు కల్పించడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. 'మేము కొనసాగుతున్న పంచాయతీలలోనూ మాకు తెలియ కుండా అభివృద్ధి కార్యక్రమాలు చెప్పడమేమిటి?' అని నిలదీస్తున్నారు. అయితే ఎంపీడీవో మాత్రం ఏమీ తెలియ నట్లు మౌనం వహిస్తున్నారు. ముఖ్యంగా మండలం లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా లన్నా మండల అధ్యక్షుడితో చర్చించి ఏ పంచాయతీలో ఏయే పనులు చేపట్టాలి? సమస్యలు గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు తెలిపి పనులు చేపట్టాల్సి వుంది. అయితే ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారాలు ఇవ్వ కుండానే తన సొంత నిర్ణయాలతో ఇష్టానుసారం ప్రవర్తి స్తున్నాడని సర్పంచ్‌లు ఆరోపించారు. అలాంట ప్పుడు పంచాయ తీలలో సర్పంచ్‌లు ఎందుకు? ఎంపీడీవోనే అన్ని పనులూ చేసుకోవచ్చు కదా?' అని ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వారి ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

బాడీ బిల్డర్‌కు అభినందనలు

ప్రజాశక్తి -నగరి : పుత్తూరు పట్టణా నికి చెందిన బాడీ బిల్డర్లు దినేష్‌ను డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అభినందించారు. పళ్లిపట్టులో నిర్వహించే బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనేందుకు దేహదారుఢ్య శిక్షణ పొందడానికి, పౌష్టికాహారం తీసు కోవడానికి అవసర మయ్యే ఖర్చులకు బాడీ బిల్డర్‌కు గతంలో ఆయన ఆర్థిక సాయం అందిం చారు. పోటీలో పాల్గొన్న దినేష్ గెలుపొంది కప్పు గెలుపొందాడు. డీఎస్పీ కార్యాల యానికి తోటి క్రీడాకారులతో విచ్చేసి గెలుపొందిన కప్పును శుక్రవారం డీఎస్పీకి అందించి కృతజ్ఞతలు తెలుపగా ఆయన దినేష్‌ను అభినందించారు.



బాడీ బిల్డర్‌ను అభినందిస్తున్న డిఎస్‌పి సయ్యద్ అహ్మద్ అజీజ్

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు: డీపీవో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనుల్లో అలసత్వం వహించవద్దని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు మండల అధికారులను ఆదేశించారు. రాయలపేట గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులను డిపివో శుక్రవారం తనిఖీ చేశారు. రాయలపేటలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. మంచినీటి ట్యాంకులు క్రమం తప్పకుండా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలని ఎక్కడా పారిశుధ్య నిర్వహణ లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. హోటల్స్ వారు తప్పని సరిగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకోవాలని, రోడ్డు పక్కన చెత్త చెదారం వెయ్యకూడదని, ఈ ఆదేశాలు అందరూ పాటించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తాగునీటి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిం చాలన్నారు. సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సర్వీసులను వారికి సకాలంలో అందించాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతతో అందరూ సమయపాలన పాటిస్తూ అన్ని సర్వీసులు ప్రజలకు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమం లోఎంపీడీవో బాలాజీ , పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి, రాయలపేట గ్రామపంచాయతీ సర్పంచ్ అరుణ, పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డిపివో సుధాకర్‌రావు

తానా సదస్సుకు రండి...

ఎమ్మెల్యేకు పిలుపు

ప్రజాశక్తి - యాదమరి: ఉత్తర అమెరికాలోని అతి పెద్ద భారతీయ అమెరికన్ సంస్థగా గుర్తింపు పొందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులు తానా సదస్సు డైరెక్టర్ సునీల్ పంత్రా పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్‌ను చిత్తూరులో శు క్రవారం కలిసి జూలై 3 వ తేదీనుండి 5వ తేదీ వరకూ అమెరికాలోని నోవీ మిచిగాన్ ప్రాంతంలో నిర్వహించే 24వ తానా సదస్సుకు రావాలని ఆహ్వాన పత్రికను అందించారు. తరతరాల తెలుగు తనంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ తానా సభలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నా మని, ఈ ఏడాది జరిగే కార్యక్రమానికి అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యేను కలిసి 24వ తానా సదస్సుకు సం బంధించిన ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వా నిం చారు. తానా సంస్థ గత కొద్ది ఏళ్లుగా చేస్తు న్న సామాజిక సేవ కార్యక్ర మాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ల గా ఆయన ఆ సంస్థ ప్రతినిధులను అభినం దించారు. తప్పకుండా 24వ తానా సభకు హాజరు అవుతానని తానా ప్రతినిధులకు ఆయన హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే మురళిమోహన్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

సిబ్బంది సంక్షేమానికి సహకరించండి

- రెండో రోజూ కొనసాగిన ధర్నా
- ఏపీఎస్ ఆర్‌టిసి ఉపాధ్యక్షుడికి సిబ్బంది వినతి

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : ఆర్టీసీ సిబ్బంది సంక్షేమానికి సహకరించాలని డిమాండ్ చేస్తూ కుప్పం డిపో ఎన్ఎం యుఏ నాయకులు, సభ్యులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. డిపో అధ్యక్షులు యస్ మునస్వామి, డిపో కార్యదర్శి ఈ జయపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మానికి ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ.వేలు, కార్యదర్శి జేవి భాస్కర్, జిల్లా యాగం రెడ్డి, జంపనూర్ శీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎన్నో ఇబ్బంది లను ఎదుర్కొంటూ ప్రయాణికులకు సేవలు అందిస్తున్నారని వారి సంక్షేమానికి సహకరించాలని కోరారు. ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ కార్డు బదులు, పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పిం చాలని, పి రామ్మోహన్ రావు ప్రవేశ పెట్టిన ఎస్ఆర్‌బిఎస్ సంక్షేమ పథకం అమలు చేయాలని, గ్యారేజ్ సిబ్బంది సమస్యలు పరిష్క రించాలని కోరారు. అన్ని యూనిట్ల ఉద్యోగులకు బకాయి పడ్డ ఏఏఎస్ ఇంక్రిమెంట్స్, పనిష్మెంట్ పూర్తయిన వారికి సకాలంలో ఇంక్రిమెంట్స్ కలపాలని, సిబ్బందికి పనిష్మెంట్స్ అప్పీలు కోసం ఏసిఎల్ హైకోర్టులో పిటిషన్‌కు అవకాశం కల్పించాలని, ప్రైవేటు బస్సుల తాకిడి తట్టుకోనే విధంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, కనీస విద్యార్హత లేని, అనారోగ్యంతో వున్న డ్రైవర్లను కండక్టర్, డ్రైవర్ రెండు విధులకు బలవంతంగా పంపడం మానుకోవాలని, సూచించారు. సంస్థలో ఒక పద్ధతి లేకుండా ఓడిలు వాడే విధానాన్ని సరి సరి చేసుకోవాలని, సిబ్బందికి అత్యవసర సమయాల్లో 3 రోజులు సెలవు ఇప్పించాలని, మహిళలకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు లో జాప్యం నివారించాలని, అర్హత కలిగిన కింది స్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. నాలుగు ఏళ్లుగా ఉద్యోగులకు నిలిపివేసిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు వెంటనే మంజూరు చేయాలని, 20 సంవత్సరాల సర్వీసు ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు అమలు చేయాలని కోరారు. 2014, సెప్టెంబరు1 ముందు ఉద్యోగ విరమణ పొంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి జీవన భృతి చెల్లించాలని కోరారు. ధర్నా అనంతరం జిల్లా నాయకులతో కలిసి వినతి ఏపీ ఎస్ ఆర్టీసీ ఉపా ధ్యక్షులు పిఎస్ మునిరత్నంకు అందించారు. ఈ కార్యక్ర మంలో డిపో ఛైర్మన్ బొట్టు మణి, సంయుక్త కార్య దర్శి జి మునెప్ప, డిపో ట్రెజరర్ యస్‌పి నవీన్, డిపో వైస్ ప్రసిడెం ట్ టివి కుమార్, వర్కింగ్ ప్రసిడెం ట్ దిలీప్ కుమార్, పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఆర్‌టిసి ఎన్ఎంయుఏ నాయకులు

మంచినీటికి కటకట

ప్రజాశక్తి - చిల్లకూరు :

వారం రోజుల నుంచి త్రాగడానికిమంచి నీళ్లు లేక చిల్లకూరు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. చిల్లకూరు గ్రామం, మున్సిపాలిటీలో చేరిన తర్వాత, ఒక్కసారి మోటారు చెడిపోతే వారం రోజులు దాకా నీళ్లు రాక గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అదే పంచాయతీగా ఉన్న రోజుల్లో మోటార్ చెడిపోతే ఒకటి రెండు రోజుల్లోనే సమస్య పరిష్కరించేవారని గ్రామస్తులు తెలిపారు. మున్సిపాలిటీలో కలిసిన తర్వాత మోటార్ల రిపేరు తీవ్ర జాప్యమవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇకనైనా మోటార్లు రిపేరు చేయించాలని కోరుతున్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -ఏర్పేడు :

కేవిబి పురం మండలం, కోవనూరు గ్రామానికి చెందిన గుర్రంకొండ మనోజ్ కుమార్ (సాంబార్ మనోజ్) రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని, ఎక్కువ ధరకు అమ్ముటకు గాను సుబ్బయ్య (సుబ్బడు), కోనేటి రాజేష్‌ల సహాయంతో పాపా నాయుడుపేట నుండి రవాణా చేస్తుండగా ఏర్పేడు పోలీస్‌లు పట్టుకొని ముద్దాయిని అరెస్ట్ చేశారు. 1474 కేజీల బియ్యం, బోలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని ఏర్పేడు సిఐ జయచంద్ర తెలి పారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
I.A.No. 141 of 2024
O.S.No. 41 of 2024

Between:
G.N.Prabhakar ..Petitioner/Plaintiff
And:
G.Jaya Prakash Reddy ...Respondent/Defendant

NOTICE TO THE RESPONDENT

To
G.Jaya Prakash Reddy
S/o late G.Ranga Reddy,
D.No.2-1264/4, B.V.Reddy Colony,
Chittoor, Chittoor District.
Sir,

Please take notice that the petitioner/ plaintiff has filed the above IA for attachment of the schedule mentioned properties belongs to you before judgment. The said IA is posted to **16.06.2025** for your appearance. If you have got any objection you may appear on **16.06.2025 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

A-SCHEDULE

Chittoor District - Chittoor Sub District - Gudipala Mandal and Grama Panchayat - Gudipala Revenue Accounts - Lands in
1. Sy.No.403/1- Ac.2.95 cents
2. Sy.No.403/2- Ac.0.67 cents
3. Sy.No.400/2 - AC.0.77 cents

Commercial property - Ranga Fruit canning industries Situated within the following boundaries.
East :Reserve forest, West:National highway North: Reserve Forest, South: National Highway and Sy.No.403/1.

B-SCHEDULE

Chittoor District - Chittoor Sub District - Chittoor Municipality - Chittoor Mandal - Chittoor Town house bearing No.2-1264/4- Measuring 2985 sq.ft or 331.67 sq.yds. Situated within the following boundaries
East :House of A.Aparajitha Reddy. West: Plot No.22, North: 40 feet width road, South: property of A.Arul Moie

Sd/- **V.LOKANADHA REDDY**
Advocate for the Petitioner
Place:Chittoor, Date:10.04.2025

IN THE COURT OF THE PRL CIVIL JUDGE (JUNIOR DIVISION). CHITTOOR
I.A NO 167 OF 2025
O S NO. OF 2025

Between
The Villagers of Thellagundlapalli gram panchayath Rep., by K. Subramanyam Naidu **...Petitioner/Plaintiff**
And
M.Lavakumar Naidu and others **...Respondents/ Defendants**

GENERAL NOTICE TO PUBLIC

It is here by brought to the notice of the Villagers of Thellagundla palli gram panchayath that M.Lavakumar Naidu others encroached upon the schedule property here under mentioned which is communal property meant for public. K. Subramaynam Naidu, resident of Thellagundla palli filed above suit against M.Lavakumar Naidu and others over schedule property interests of the villagers of Thellagundla palli gram panchayath to protect the common representative capacity on behalf of the above village. The above case posted to **15.04.2025** by intimating to general public by way of paper publication about the objection if any by the villagers in filing above suit by K.Subramaynam Naidu on behalf of villagers of Thellagundla palli gram panchayath. If any villager have any objections in filing above suit by K.Subramanyam Naidu in representative capacity on behalf of the villagers of Thellagundla palli gram panchayath, please be present in person or through advocate on **15.4.2025 at about 10-30 AM** in the above court and raise objections on the above aspect.

SCHEDULE

Chittoor District- Chittoor Sub District Thavanampalli Mandal Patnam Village Revenue Accounts - Thellagundlapalli Gram Panchayath - Natural water course at Thellagundla palli village in S.No.391 classified as "Vaagu" to an extent of Ac.0.93 cents (full extent)

(B.O)

Sd/- **C.K.RAGHU**
Advocate for Petitioner

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
O.S.No. 41 of 2024

Between:
G.N.Prabhakar ... Plaintiff
And:
G.Jaya Prakash Reddy ..Defendant

SUMMONS TO THE DEFENDANT

To
G.Jaya Prakash Reddy
S/o late G.Ranga Reddy,
D.No.2-1264/4, B.V.Reddy Colony,
Chittoor, Chittoor District.
Sir,

Please take notice that the plaintiff has filed the above suit against you for recovery of sum of Rs.**42,31,666-00** together with further interest at 24% p.a. from the date of suit till the date of realization and for costs. The said suit is posted to **16.06.2025** for your appearance.If you have got any objection you may appear on **16.06.2025 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sd/- **V.LOKANADHA REDDY**
Advocate for the Plaintiff
Place:Chittoor, Date:10.04.2025